


# వెన్నెల మలుపులు

—చింతూరి మల్లిబాబు

**నాటు దారి** వెంట ఒంక లొంకలు తిరుగుతూ ఎడ్ల బండి ముందుకు సాగిపోతూంది-యవ్వన వతి గుండెలోని నిగూఢమైన కోరికలా. అది అడవి ప్రాంతం. చాలావరకు ఆకులు రాల్చుకుని, మ్రో డువారిన కొమ్మలతో నిలబడిపోయిన చెట్లు, నగ్న సుందరీమణుల్లా వెన్నెల ప్రియుని కౌగిలింతల్లో పరవశించి పోతున్నాయి. స్త్రీ హృదయ మార్ద వంలా రెపరెపలాడుతున్న చల్లని గాలి అంతటా అలుముకో సాగింది. ఆ ప్రశాంతమైన సమ యంలో చైతన్యరావం ప్రసరింప చేస్తున్న ఎద్దుల మెడల్లోని కందుమువ్వలు...

బండి కదులుతోంది. రాళ్ళకి గుద్దుకున్నప్పుడు ఇనుప పట్టాలు టక్ టక్ మంటున్నాయి. ఇసుక తగిలినప్పుడు చక్రాలు కోసుకుపోతూ గరగరలా డుతున్నాయి. మిట్ట పల్లాలు తగిలినప్పుడు బండి కుదుపులతో విపరీతంగా అల్లడితల్ల డవు తోంది—మనసులు కలవని దంపతుల సంసా రంలా!

బండిలో ఒకవైపు తడికకు ఆనుకుని శౌరి కూర్చున్నాడు. ఎదురుగా అవతలి ప్రక్క తడికకు ఆనుకుని శేఖరం, శ్యామల. ముందు నొగల దగ్గిర కూర్చుని పాలేరు బండి తోలుతున్నాడు. నిగనిగ లాడుతున్న తెల్లని గిత్తలు వయసు



బింకంతో—తమ లక్ష్యంవైపు చొచ్చుకుపోతున్నాయి. చెట్లు పలచబడినప్పుడు బండి వెనుక నుంచి చంద్రుడు అలవోకగా బండిలోకి తొంగి తొంగి చూస్తూ వెంటే వస్తున్నాడు—అనుంగు నేస్తంలా!

చెట్లమీద, కొమ్మలమీద, ముళ్ళ పొదలమీద, రాళ్ళమీద, అందిన ప్రతి అంగుళం మేరా మంచు పరుచుకుంటున్నట్లు వెన్నెల ప్రవాహం కదుతోంది—అవధులు లేకుండా దిగంతాలు ఆక్రమించుకునే పడుచు యువకుని బలీయమైన ప్రేమలా! సాంఘిక అవరోధాల్లా అక్కడక్కడ వెన్నెల్ని చొరనియ్యకుండా క్రీనీడలు పరుస్తున్న చెట్లు, గుట్ట చెరియలు.

బండిలో నగం వెన్నెల వెలుగు, నగం తడిక చీకటి. ఆ వెలుగు నీడల్లో వాళ్ళు ముగ్గురూ దగ్గిర దగ్గిరగా...

శేఖరం లైటర్‌తో సిగరెట్ వెలిగించుకున్నాడు. ఆ లైటర్ వెలుగువడి శ్యామల ముఖం క్షణకాలం ఎర్రగా మెరిసింది—విజృంభిస్తున్న మోహంలా.

"సిగరెట్ కాల్చండి!" శేఖరం సిగరెట్ అందించబోయాడు.

"అఖర్లేదండి!" శారి నమాధానం చెప్పాడు.

ఆయన సిగరెట్ పెట్టె, లైటర్ జేబులో వేసుకున్నాడు. సిగరెట్ పీలుస్తూ పొగ రింగులు రింగులుగా వదులుతూ ఎటో చూస్తున్నాడు—భావ నమాధిలో మునిగిపోతున్న యోగిలా.

ఆ పొగ బండంతా ఆవరించి వెన్నెల ప్రనరించే భాగంలో పొగమంచులా భ్రమింపచేస్తోంది. ఆ మంచు తెర కావల శ్యామల రూపం అస్పష్టంగా కనిపిస్తూంది—అస్పష్టమైన ఆమె అంతరంగంలాగే!

ఆయన సిగరెట్ చివర కొడిగట్టిన బూడిద దులిపేందుకు వ్రేలితో విదిలించాడు. బూడిదతో బాటు ఒకటి రెండు నిప్పు రవ్వలు చెదరి ప్రక్కనున్న ఆమెమీద పడ్డాయి. ఆమె తొట్రుపడి, పైట చెంగు విదిలించుకుంది.

శారి అప్రయత్నంగానే చిరునవ్వు నవ్వాడు. ఆమె గమనించి సిగ్గుపడి కళ్ళు వాల్చేసింది.

శారి ఆమె వైపే చూస్తున్నాడు. పైట జారింది.

చిలిపి గాలి దాన్ని మెల్ల మెల్లగా ప్రక్కకి తొలగించేస్తోంది. పమిట మాటున తళతళలాడుతున్న బంగారు మంగళసూత్రాలు ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలకి కాబోలు అందంగా కదులుతున్నాయి.

చీరకట్టుకీ, జాకెట్టుకీ మధ్యన వెన్నెల దొంతరల్లా మెలిదిరిగి నిగనిగలాడుతున్న ఉదరభాగం. శారి తదేకంగా ఆ అందాల వంపులకేసి చూస్తూండి పోయాడు. ఆమె కనిపెట్టిందేమో అతను ఆదేపనిగా ఆమె సౌందర్యాన్ని నేత్రాలతో ఆస్వాదిస్తున్న విషయం—గమ్మున పైట తీసి నిండ కప్పుకుని సర్దుకు కూర్చుంది.

అతను మరో వైపు దృష్టి మరల్చాడు.

దూరంగా ఆకాశం నీలిమలో ఐక్యమైపోతున్న కొండల్నీ, వాటి దిగువన పొంచి ఉన్న దట్టమైన నలుపునీ పరికించడంలో నిమగ్నమయ్యాడు.

శారి ఆ గ్రామం ఉద్యోగ రీత్యా వచ్చి రెండు మూడు నెలలైంది. వచ్చీ రావడంతోనే శేఖరంతో పరిచయమైంది. ఆయన అక్కడ మోతుబరి రైతు. ఆ ఊళ్ళోకల్లా అతనే విద్యావంతుడు, నాగరికుడు. అంతకుమించి సౌమ్యుడు, స్నేహపాత్రుడు. శారి నెంతో ఆదరంగా, గౌరవంగా చూస్తాడు.

శారికి కూడా అతనంటే ఎక్కడలేని గౌరవం. శేఖరానికి ముప్ఫయి అయిదు సంవత్సరాలుంటాయి, శారికి ఇరవై మూడు ప్రాయం. ఆ ఇద్దరి మధ్యా అవ్యాజమైన ఆత్మీయత, గాఢమైన స్నేహభావం కొద్దికాలంలోనే పెనవేసుకున్నాయి.

ముక్కు మొహం తెలియని పరాయి ప్రదేశంలో అంతటి సహృదయుని సాన్నిహిత్యం, స్నేహం లభించడం శారి కెంతయినా అదృష్ట మనిపించింది. తీరికున్నప్పుడల్లా ఆయ నింటికి వెళ్ళి హాయిగా కబుర్లు చెప్పుకోవడం, కాఫీలు తాగడమూ నూ! సాయంత్రం వేళల్లో పొలాలకేసి, ఏటి గట్లకేసి ఆయనతో కలిసి షికార్లు చెయ్యడం—శారి కెంతైనా సరదా!

ఆ రోజు రాత్రి శారి మంచి నిద్దర్లో ఉండగా వచ్చి లేపాడు శేఖరం గారి పాలేరు. "అయ్యగారు రమ్మంటున్నారు" అని చెప్పి వెళ్ళి పోయాడు వాడు.

శారి కొంత ఆశ్చర్యపడి, నిద్ర కళ్ళతోనే లేచి శేఖరం ఇంటికి వెళ్ళాడు.

శారి వెళ్ళేసరికి శేఖరం ఇంటి ముందు పంది

ట్లో నిలబడి ఉన్నాడు. తెల్లని ధోవతీ, షర్టూ వేసుకుని ఉన్నాడు. భుజం మీద ఉత్తరీయం. ఎటో ప్రయాణం వెళ్తున్నట్లున్నాడు.

"రేపు కలప కూపులు వేలం ఏదో ఉందంట- తాలూకా హెడ్క్వార్టరులో. నేను వెళ్తున్నాను. నీక్కూడా అక్కడేదో పనుందంటివిగా? బండిలో వెళ్దాం—వస్తావా?" ఆయ నడిగాడు.

శౌరికి బద్ధకంగా ఉంది. ఇంకా కొంత సేపు నిద్రపోతే బాగుండు ననిపిస్తోంది.

కాని, ఆయన ఉత్సాహం పాడు చెయ్యడం ఇష్టం లేక ప్రయాణానికి అంగీకరించాడు శౌరి.

వెంటనే ఇంటికి వెళ్ళి ముఖం కడుక్కుని, తల దువ్వుకుని, బట్టలు వేసుకుని ప్రయాణానికి సిద్ధమై వచ్చాడు.

ఊరంతా గాఢనిద్రలో మునిగి పోయి నిస్తబ్దగా ఉంది. వెన్నెల మేలి ముసుగులా కప్పేసింది. అప్పటికే బండి కట్టి సిద్ధంగా ఉంది.

శేఖరం బండి ఎక్కలేదు. ఎవరి కోసమో నిరీక్షిస్తున్నట్లు వాకిట్లో నిలబడ్డాడు. శౌరి కూడా ఆయన ప్రక్కనే నిలబడి పోయాడు. ఇంతలో లోపల నుంచి శ్యామల వచ్చింది. గుండెలు వింత ఆనందంతో దడ దడ కొట్టుకున్నాయి శౌరికి.

పాలేరు చిన్న సూట్కేసు తెచ్చి బండిలో పెట్టాడు.

శేఖరం శౌరిని బండెక్కమన్నాడు. శౌరి వెంటనే బండెక్కి లోపల కూర్చున్నాడు. బండికి పైన గూడుంది. కింద మెత్తగా గడ్డి పరిచి పైన తుంగ చాప వేశారు.

తరవాత శేఖరం, శ్యామల ఎక్కారు.

శ్యామల శేఖరానికి దూరవు బంధువు. వరుసకి చెల్లె లవుతుంది. శేఖరం వాళ్ళింట్లో ఏదో శుభ కార్య ముంటే- ఆమె, ఆమె అన్న గారు కాబోలు ఓ రెండు వారాల క్రితం ఇక్కడికి వచ్చారు. ఆమె అన్నగారు ఒకటి రెండు రోజులుండి తిరిగి స్వగ్రామం వెళ్ళిపోయాడు. ఈమె మాత్రం ఇక్కడే ఉండి పోయింది.

శౌరి శేఖరం ఇంటి కెళ్ళి నప్పుడల్లా శ్యామల ఎక్కడి నుంచి గాని శౌరిని కనిపెడుతూనే ఉండేది. అత నక్క డున్నంత సేపూ ఆమె చూపులన్నీ అతని మీదే. ఈ సంగతి మొదట్లో అతను గమనించలేదు. ఒకసారి శేఖరం కోసం అత నింటి కెళ్ళాడు శౌరి. ఆయన లేడు. శౌరి యాధాలాపంగా పందిరి క్రింద వాలు కుర్చీలో కూర్చుని పాత వీక్లీ పేజీలు తిరగేస్తున్నాడు. కొంత సేపటికి అప్రయత్నంగానే తల ఎత్తాడు- ఎదురుగా వోరగా వేసిన కిటికీ రెక్క పట్టుకుని తదేకంగా అతని వేపు చూస్తోంది శ్యామల మోహనంగా!

అతని చూపులు యాదృచ్ఛికంగా ఆమె చూపులతో కలవడంతో ఆమె సిగ్గువడి కిటికీ తలుపు తటాల్న మూసేసింది.

అతని ఒళ్ళు జలదరించింది.

ఆ జవరాలి తీయని చూపులు అతనికి మత్తెక్కించాయి.

అతనిలో ఏవో భావ స్వప్నాలు తొణికాయి!

అప్పటి నుండి అక్కడికి వచ్చినప్పుడల్లా శౌరి కళ్ళు ఆత్రంగా శ్యామల కోసం వెదికేవి.

ఆమె కిటికీ వద్దో, ద్వారం ప్రక్కనో, వరండాలో ముగ్గులు పెడుతూనో, అమ్మలక్కలతో కబుర్లు చెవుతూనో, స్నేహితురాండ్రతో వచ్చీసాడుతూనో అతనికి దర్శన మిచ్చేది- దోర నగవుతో, ఓర చూపులతో.

ఒకసారి శౌరి కాంపు కెళ్ళి బాగా చీకటి పడ్డాక ఇంటికి చేరాడు. స్టౌ వెలిగించి వంట చేసుకోవాలనుకుంటున్నాడు. ఇంతలో శేఖరం రమ్మంటున్నాడని కబురు. అలాగే వదిలేసి వెళ్ళాడు శౌరి.

ఆవేళ శేఖరం ఇంట్లో ఏదో విందు. అందరూ భోజనాలు చేసి సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. వెళ్ళి వెళ్ళడంతోనే శౌరిని భోజనానికి కూర్చోమన్నారు.

హాల్లో భోజనం వడ్డించారు. సమీపంలో స్టూలు మీద హరికెన్ లాంతరు పెట్టారు.

మామూలుగా వెళ్ళి భోజనం ముందు కూర్చున్నాడు శౌరి.

ఏమిటో ఆ వేళంతా కొత్తనిపించింది.

ముందుగా కొంచెం మంచి నీళ్ళు త్రాగి చుట్టూరా దృష్టి సారించాడు. హాల్లో ఎవరూ లేరు. అవతల మధ్య గది ద్వారం వద్ద శ్యామల నుంచుని లోపల ఆడ వాళ్ళతో ఏదో మాట్లాడుతోంది.

తెల్లని చీర, నల్లని రవిక వేసుకుంది. మసక వెలుతురులో ఆమె అస్పష్టంగా గోచరించింది.

ఆమె కెదురుగా కూర్చుని భోజనం చేయాలంటే ఏదో మొహమాట మనిపించింది అతనికి.

ఇది వరకు ఎప్పుడు భోంచేసినా, శేఖర్తో

మనిషిపుట్టుక_పెరుగుదలల గురించి
యండమూరి వీరేంద్రనాథ్
జన్మశాస్త్ర పరిశోధనన్ని హారర్ సస్పెన్స్‌లతో
మేళవించి చేసిన మరో అపూర్వ నవలా సృష్టి
అష్టావక్ర
మొదటి భాగం వెల: 20/-
రెండవభాగం వెల: 20/-
త్వరలో! రక్తసింధూరం
యండమూరి వీరేంద్రనాథ్ తొలిడైరెక్టు నవల!
నవభారత్ బుక్ హౌస్ కార్ల్‌మార్క్స్‌రోడ్, విజయవాడ-2
అన్ని బుక్‌స్టాల్స్‌లోనూ లభించును.
అడ్వాన్స్ పంపిన VPP లో పంపబడును.

RADEUS/PHC/2-8

జిడ్డు వోడే చర్మం?




PUMA
ప్యూమా నీమ్ ఫేస్ ప్యాక్ వాడండి.

ఇందులో వేప, లోధ్ర మరియు ఇతర ఔషధ వనమూలికలు చేర్చబడినవి. జిడ్డుదనాన్ని తగ్గిస్తుంది. ముఖంపైన వచ్చే పొక్కులను, ఇతర చర్మ వికారాలను తగ్గిస్తుంది. చర్మానికి స్వచ్ఛత, బిగువు చేకూర్చి, ఛాయను మెరుగు పర్చుతుంది. తక్కువ ఖర్చుతో, సులభంగా మీరే 'స్వయంగా చేసుకోగల ఫేషియల్'.
ప్యూమా మీకు విస్తృత శ్రేణిలో సౌందర్య సాధనాలను, వనమూలికలతో తయారు చేయబడిన ఔషధ గుణ యుక్త చికిత్సా పదార్థాలను అందిస్తోంది. అన్నీ వనమూలికలను ఉపయోగించి ఆయుర్వేద ఫార్ములా రూపంలో రూపొందించబడినవి. ఎలాంటి కృత్రిమ వస్తుసారం కలపబడలేదు.
ప్రముఖ కెమిస్ట్ దుకాణాలలో, జనరల్ స్టోర్స్‌లో లభ్యం.
'మీ రీటైలర్ నుండి కాని లేక మాకు కాని వ్రాసి 'ప్యూమాస్ గైడ్ టు బ్యూటీ' అనే ఉచిత ప్రతిని పొందండి.
ప్యూమా హెర్బల్ కాస్మెటిక్స్ ప్రై. లి. కింగ్స్‌వే, నాగపూర్ 440 001.

కలిసే చేయడం జరిగేది. ఇంట్లో వంట మనిషే వడ్డన చేసేది. భోజనం సమయమప్పుడు ఇంట్లో ఆడ వాళ్ళెవరూ ఆ సమీపానికి వచ్చేవారు కాదు.

ఈవేళ ఆ పద్ధతికి పూర్తిగా వ్యతిరేకం. ఎందుకో అతనికి అర్థం కాలేదు. ఇవాళ్టి విందులో ఏదో ప్రత్యేకత ఉన్నట్లనిపించింది.

అతను దిక్కులు చూడటం మానేసి అన్నం కలుపుకోబోతున్నాడు. ఇంతలో వెండి గజ్జెల పట్టాలు అలంకరించుకున్న రెండు అందమైన పాదాలు నాట్యం చేస్తున్నట్లు అతనివైపు కదిలి రావడం కనిపించింది.

అతను తల ఎత్తాడు.

శ్యామల అతని దగ్గరకు వచ్చి, ఒంగి నేయి గిన్నె తీసి—"నేయి వేసుకోండి!" అంటూ చెంచాతో వేస్తోంది.

అతనికి నేయంత ఇష్టం ఉండదు కాని, ఆమెని వారించడానికి బిడియపడి ఊరుకున్నాడు. ఆమె జాస్తిగానే నేయి వడ్డించింది.

అతను తల వంచుకుని మళ్ళీ భోజనానికుపక్రమించాడు.

ఆమె వెళ్ళి గడప దగ్గర కూచుని మళ్ళీ మాట్లాడుతోంది లోపలి వారితో.

నేను కొత్తవాణ్ణి—మగవాణ్ణి నే నున్నానన్న ధ్యాసే లేనట్లుగా ఎంతో ఫ్రీగా మాట్లాడేస్తోంది. ఒళ్ళంతా కదిలిపొయ్యేలా నవ్వుతూ, వాళ్ళ ఊళ్ళో ఓ అమ్మాయి పెళ్ళి సంగతులు—తలంబ్రాల సమయంలో ఆమె ఎట్లా పోటీపడి వరుని శిరస్సు మీద, వళ్ళేనికి వళ్ళెమే ఎలా దిమ్మరించిందీ, అమ్మలక్కలు బ్రతిమాలి బుజ్జగించి శోభనం పెళ్ళికూతుర్ని ఎలా గదిలోకి పంపిందీ—వివరంగా వైనవైనాలుగా తన ఫీలింగ్సుతోసహా, చేతులాడిస్తూ, కళ్ళు తిప్పుతూ గలగలా చెప్పేస్తోంది.

ఆమె అంత ఉత్సాహంగా ప్రవర్తించడానికి, శృంగార ఘట్టాలు అంత రసవత్తరంగా సరదాగా వివరించడానికి శౌరి ఉనికే కారణం కావచ్చు. ఆమె ప్రతి పనిలోనూ ఆ సమయంలో సహజం కాక అతే కనిపించింది. ఆమె మాటల సందర్భంలో అప్రయత్నంగా చూసినట్లు అతనికేసి కొంటెగా చూడడం, కమ్మగా కిలకిలా నవ్వడం—పదే పదే శౌరి దృష్టిని ఆకర్షించడంకోసమేనని స్పష్టం!

మారన్నం వడ్డిస్తానంటూ మళ్ళీ వచ్చింది శ్యామల. ఇందాకటినుంచీ హావభావాలు, ప్రవర్తన పరికిస్తున్న శౌరి గుండెలో ఏదో వెచ్చని అలజడి ప్రారంభమయింది. ఆకలి తగ్గిపోయినట్లనిపించింది. అప్పటికే కడుపు నిండిపోయినట్లుగా ఉంది. పైగా నేయి ఎక్కువ కావడం వల్ల దాహం అధికమై మంచినీళ్ళు విపరీతంగా తాగవలసి వచ్చింది. ఇంకా వేయించుకునే ఓపిక లేదు.

"అవసరం లేదండి. చాలు" అన్నాడు చేయి అడ్డం పెడుతూ.

"అదేమిటి? ఇంకా బూరెలుకూడా అలాగే ఉంచేశారు? ఏమిటి ఇంక మీరు తిన్నది? వాటిన్నీ చిదవండి. నేయి వడ్డిస్తాను" అంటూ ఆమె చేతనున్న అన్నపు పళ్ళెం కింద పెట్టి, నేతి గిన్నె అందుకుంది.

ఆప్యాయతతో కూడిన ఆ అధికారపు చెలాయింపుకి ఒక వైపు ఆనందం, మరోవైపు దిగులూ ఒక్కసారే వేసుకొచ్చాయి అతనికి. దిగులెందుకంటె ఆమె అంత అభిమానంగా అతనిచేత తినిపించాలని ముచ్చట పడుతూంటే, ఇంక తినే ఓపిక లేకపోయినందుకు—అసహాయునిలా కళ్ళెత్తి ఆమె వైపు చూశాడు.

ఆమె నవ్వు మొహంలో, కళ్ళల్లో ఏదో తడి మెరిసిన తళుకుతో అతన్ని వివశుణ్ణి చేసివేసింది.

ముఖం వంచుకుని ఆమె చెప్పినట్లల్లా చేశాడు.

తరువాత ఆమె మారన్నం పెట్టబోయింది.

అప్పటికే అతను ఉక్కిరిబిక్కిరై పోతున్నాడు.

"అబ్బ! ఇప్పటికే ఎక్కువైపోతోంది. నేను తిన్లేను" అన్నాడు.

అయినా, ఆమె వినిపించుకోలేదు. "కొంచెమే. పెరుగు వేసుకోండి. లేకుంటే వేడి చేస్తుంది." చిన్న పిల్లవాని మాటలు తోసివేసినట్లు తోసివేస్తూ, తన పని తను చేసేసింది.

శౌరి తలెత్తి ఆమె వైపు చూశాడు.

పొడువాటి వాలుజడ భుజం మీంచి ముందుకు జారి నేల కానుతూ దీపం వెలుగులో నల్ల త్రాచులా భ్రమ కలిగిస్తోంది మెడకి పూసుకున్న మంచిగంధం గుప్పుమని నాశికాపుటాల్ని ఎగరగొట్టేస్తోంది. ఉద్వేగంతో అతని గుండె కొట్టుకుంది. మూర్తీభవించిన ఆ మోహనాకారం అతనిలో ప్రత్యణువునీ ఆకర్షించి, అయస్కాంతంలా గిజగిజ లాడిస్తోంది.

ఆమె పెరుగు వడ్డించి, అక్కడినించి కదలి వెళ్ళిపోయింది ఒయ్యారంగా.

పాల నురగల్లా పాదాలమీద కదులుతూన్న చీర కుచ్చెళ్ళు, తామర తూడుల్లా నిగనిగలాడుతూన్న గుండ్రటి భుజాలు, కదలి వెళుతూంటే ఊగిసలాడే నడుమూ, అద్భుతంగా సొగసుగా సంచలించిన నితంబ విన్యాసం—అతణ్ణి మంత్రముగ్ధుణ్ణి చేసివేశాయ్.

ఆ వేళ చివరకు భోజనం ఎలా ముగించాడో అతనికి తెలీదు. ఏవో అవ్యక్తమైన విద్యుత్తరంగాల మధ్య ఉల్లాసంగా ఊగిపోయినట్లనిపించింది.

తరవాత రెండు రోజులు గడిచాయ్. శౌరి తన పనుల్లో తను తిరగవలసి వచ్చింది. శ్యామల మళ్ళీ అతనికి తారసపడలేదు.

ఇప్పుడు ఇట్లా హటాత్తుగా ప్రయాణమై వెళ్ళిపోతూంది. ఈ వియోగం అతనికి చాలా బాధగా ఉంది.

బండి మలుపు తిరిగింది-ఎదురుగా కురవ-దాని అంచునుండే బాట; మెరక ఎక్కలేక ఎడ్లు మెడలు వంచి లాగుతున్నాయ్!

"కాస్త ముందుకు రండి! కాడి తేలిపోతోంది." పాలేరు హెచ్చరించాడు.

శేఖరం వెంటనే బాగా ముందుకి జరిగాడు. శ్యామలని కూడా జరగ మన్నాడు. ఆమె జరిగి కూర్చుంది. శౌరి కొంచెం జరిగాడు. ఇప్పుడు శ్యామల, శౌరి ఇంచుమించు ఎదురెదురుగా ఉన్నారు.


అక్కడ చెట్లు దట్టంగా ఉన్నాయి. సన్నటి బాట. వెన్నెల ఏమంత బాగా వాటినుండి చొచ్చుకురాలేకపోతోంది. చెట్ల క్రీనీడలు సాంద్రంగా నలువైపులా పరుచుకున్నాయి. పక్కగా కురవమీద బర బర మండుతున్న ఎండు మొద్దుల ఎర్రటి మంటయొక్క కాంతి అప్పుడప్పుడు బండి ముందు భాగంలో పడుతూంది.

ఇంతలో బండి కుదుపు. ముందుకు తూలబోయి, ఆపుకుందుకు చేయి కింద మోపబోయాడు శౌరి. అనుకోకుండా అతని చేయి దగ్గరగా ఉన్న ఆమె పాదం మీద పడింది.

ఆ పాదం కోమలంగా ఉంది. మృదువుగా చేతితో నొక్కాడు. అంతలో ఆమె చేయి అతని మీద పడింది. గట్టిగా అదిమింది. అతని ఒళ్ళు గగుర్పొడిచింది. ఆమె చేయి ఎందుకో కొంచెం వణకుతోంది. తరవాత వారిద్దరి వ్రేళ్ళు- ఒకరి వ్రేళ్ళలో కొకరి వ్రేళ్ళు దూర్చుకొనిపోయి గట్టిగా పెనవేసుకున్నాయ్. ఆమె సుకుమారమైన సన్నటి వ్రేళ్ళు ఆవిరి పొగలు క్రక్కుతున్నాయి. అనురాగవతియైన ఆ యవ్వనవతి కరస్పర్శ ఆనందోద్రేకంలో ముంచెత్తి అతన్ని కకావికలు చేస్తోంది.

గాలి స్తంభించింది! కాలం ఘనీభవించింది!

రోదసీ గహ్వారంలో ప్రచండమైన అంతర్వేగంతో పరిభ్రమిస్తూ ప్రఫుల్లమైన ఘోషతో పరస్పరం వికర్షించుకుని ఢీ కొనడానికి సిద్ధంగా ఉన్న



రెండు బ్రహ్మాండమైన అగ్నిగోళాల్లా ఆమె, అతను మూగబాధతో, బలీయమైన తృష్ణతో, గాఢమైన వాంఛతో ఉక్కిరి బిక్కిరై పోతున్నారు!

ఏదో మత్తు, ఏదో ఆవేశం, మరేదో ఆనందం, ఇంకేదో మహత్తరమైన కొత్త ఉజ్జ్వల అనుభూతి...

ఎదురెదురుగా మోహరించి- ఒకదాని కొకటి గాఢంగా ఒరుసుకోవాలనీ, ఒక దానితో ఒకటి సంపూర్ణంగా సంలీనం కావాలనీ కాంక్షతో, తపనతో ద్విగిణీకృతంగా సంక్షోభించి పోయే రెండు తుఫాన్ మేఘాల్లా వాళ్ళిద్దరూ తల్లడిల్లి పోతున్నారు.

ఇంతలో ఒక కుదుపు... అమాంతం బండి తల్లకిందు లయ్యేలా... అంతే! ఆమె అమాంతం తూలి శారిమీద పడిపోయింది. దాంతో ఆ ఇద్దరి వ్రేళ్ళ సంకెళ్ళు చెదరిపోయాయి. అతను ఆమెని కంగారుగా పొదివి పట్టుకున్నాడు. ఆమె భయంతో, తత్తరపాటుతో అతన్ని బల్లిలా బలంగా కరచుకుపోయింది. ఆమె నడుము చుట్టూరా అప్రయత్నంగా అతని చేయి అతి లాఘవంగా, గాఢంగా, ఉద్రేకంగా బిగునుకు పోయింది! ఆమె చెంపలు అతని పెదాల్ని తాకాయి. ఆమె తలలోని మల్లెపూల సువాసన అతని నాశికాపుటాల్లో గుప్పున గుబాళించింది.

అంతే! మరు క్షణం తొట్రుపాటుతో అతని నుండి విడివడి దూరమైంది.

ఇంతల ఎట వెలుగు బండిలో పడింది.

శారి త్రుళ్ళిపడి శేఖరంవైపు చూశాడు. అతను కూడా ఆ కుదుపుకి ముందుకు తూలి, చేయి అనుకుని మొగ్గాపుకుని కళ్ళు నులుముకొని సర్దుకొని కూర్చున్నాడు. ఇంత సేపూ శేఖరం మగత నిద్రలో జోగుతూ ఉన్నట్లుంది. లేకుంటే వీళ్ళ ప్రణయ రహస్యం బయటపడేదే! ఏమీ ఎరగనట్లు తేలు కుట్టిన దొంగల్లా శారీ, శ్యామలా స్తబ్దుగా కూర్చుండిపోయారు.

ఇంత సేపూ ఇవతల లోయలోనుంచి మండుతున్న కారు చిచ్చు వెలుగు బండల చాటునుంచి, చెట్ల మాటునుంచి ఎర్రగా కనిపించిందల్లా ఇప్పుడు మలుపు దిరిగేసరికి వాళ్ళ బండి పక్కకే వచ్చేసింది.

కారుచిచ్చు విపరీతమైన వేగంలో ఎండుటాకుల్నీ, గడ్డినీ, చెత్తా చెదారాన్నీ ఆకలి గొన్నదానిలా విజృంభించి భక్షిస్తూ పెద్ద పెద్ద మంటలతో బర్ బర్ మంటూ పరుగెత్తుకుపోతూంది.

ఆ దృశ్యానికి భయపడి కాబోలు ఎద్దులు గబగబా బండిని లాక్కుపోతున్నాయి వేగంగా.

ఒక్క ఊపులో బండి దట్టమైన అడవి ప్రాంతం దాటి, బయలు ప్రాంతంలోకి వచ్చింది.

పాడుమీది ఎండుగడ్డి వెన్నెల వెలుగులో దూది పింజలు పరిచినట్లు తెల్లగా మెరుస్తూంది.

పాడుకావల మామిడితోపు. అందులోంచి వసంతకోకిల మధుర కంఠంతో వెర్రెత్తి పోయి పాడుతోంది- గుండెలు కోసేలా, ప్రపంచంలోని విరహాన్నంతనీ తన గళంలో మేళవించుకుని. మందమారుతం నేవళంగా వీస్తూంది—నాజూకైన స్త్రీ హృదయంలోని కాంక్షలా! ఈ వెన్నెల మలుపుల్లో శ్యామలా, శారుల ప్రణయ యాత్రకి ఒకటి మేలుకొలుపు; మరొకటి జోలపాట! శారి తనలో తానే మెల్లిగా నవ్వుకున్నాడు. అతనివైపు చూచి శ్యామల నవ్వింది. ఇద్దరి నవ్వులకి మధ్య రాత్రి నల్ల గీత గీసింది. రెండు ప్రేమ హృదయాలకి మధ్య ఏదో చీకటి అడ్డంగా నిలిచింది. అంతలో ఆశారేఖలా ఎదురుగుండా ఆకాశాన వేగుచుక్క పొడిచింది!

తెలతెలవారుతుండగా బండి గమ్యస్థానం చేరుకుంది. వాతావరణం మసక మసకగా ఉంది. మృదువైన గాలి చల్లగా, హాయిగా ఉంది. అందరూ దిగారు. శేఖరం అక్కడ కదలడానికి సిద్ధంగా ఉన్న బస్సువైపు దారి తీశాడు. అతని వెనుకే శ్యామల దారి తీసింది. శారి ఆమెని అనుసరించాడు.

అప్పటికిగాని శారికి అర్థం కాలేదు— శ్యామల వెళ్ళిపోతోందన్న సంగతి. అతనికి ఆశాభంగం అయినట్లయింది. ఏదో అవ్యక్తమైన బాధ అతని గుండెల్ని ఆవరించింది. ఆమె పరిస్థితికూడా అలాగే ఉన్నట్లుంది.

బస్సు హారన్ మ్రోగించుకుంటూ తన గమ్యంవైపు వెళ్ళిపోయింది. అంత సేపూ బాధగా, బరువుగా ఒకర్నొకరు చూచుకుంటున్న చూపులకు విఘాతం కలిగింది. శ్యామల బస్సులోంచి చేయూపుతూ శారికి వీడ్కోలు చెప్తోంది. క్రమంగా బస్సు ఆ మసక చీకట్లో కనుమరుగై పోయింది— అదృశ్యమై పోయిన శ్యామల సుందర స్వరూపం లాగే!

"రావయ్యా, శారీ, కాఫీ తాగుదాం" అంటూ శేఖరం శారి భుజంమీద చేయి వేయడంతో, అతను ఈ లోకంలోకి వచ్చి అతన్ని అనుసరించాడు అన్య మనస్కంగా.

×× ×× ××

నెల రోజులు గడిచిపోయాయి. శారికి శ్యామలను గురించిన స్మృతులు వెంటాడుతూనే ఉన్నాయి. ఎంత విలక్షణమైన అందం! ఎంత మధురమైన హృదయం! ఆమె గురించి తలుచుకున్న కొద్దీ ఏదో అనుభూతి, మరేదో ఆవేదన రోజురోజుకూ చోటు చేసుకుంటున్నాయ్! అటువంటి అద్భుతమైన, ఆకర్షణీయమైన స్త్రీని కట్టుకున్న ఆమె భర్త ఎంత అదృష్టవంతుడో అనిపించింది శారికి. ఆమెని మరిచిపోవడం సాధ్యం కాదు అనుకొన్నాడు.

ఆ రోజు శారికో ఉత్తరం వచ్చింది. అడ్రస్సు పరిశీలించాడు. ఆ అక్షరాల పోలిక అతని కింతకు ముందెప్పుడూ పరిచయం లేదు! కుతూహలంకొద్దీ కవరు చింపి చదవడం మొదలెట్టాడు.

"శ్రీయుత శారి గారికి,

నే నిప్పుడు మీకు జ్ఞాపకం ఉన్నానో, లేదో కాని— మీరు మాత్రం నా కెప్పుడూ జ్ఞాపకమే! మిమ్మల్ని ఈ జన్మలో నేను మరిచిపోలేను! ఇంత వరకు నన్నింత కదిలించిన వారు, ఆకర్షించిన వారు ఎవరూ లేరు- మీరు తప్ప! మీలో ఏదో గొప్పతనం ఉంది. అందుకే మీ రింతగా నన్ను వశం చేసుకున్నారు.

నే నెంతో దురదృష్టవంతురాల్ని. నాకు నాలుగు సంవత్సరాల క్రితమే మా బంధువు లబ్బాయితో పెళ్ళయింది. పెళ్ళప్పుడు పది వేల వరకట్నం ఒప్పుకున్నారు మావాళ్ళు. కాని, పెళ్ళినాటికి అంత మొత్తం సర్దుబాటుకాక సగం చెల్లించి, మిగిలింది సంవత్సరం లోపున చెల్లిస్తామని ఒప్పించి ఎలాగో ఆ పెళ్ళి జరిపించారు మావాళ్ళు. ఆ తరవాత మావ్యాపారం దెబ్బ తిని, మా కుటుంబ పరిస్థితులు దిగజారి, మిగిలిన ఆ కట్నపు డబ్బు మా వాళ్ళు ఇవ్వలేకపోయారు.

అందువల్ల నా భర్త, నా అత్త మామలు నన్ను పుట్టింటికి పంపేశారు. కట్నం పూర్తిగా తెస్తేనే తమ ఇంట్లో కాలు పెట్టమన్నారు. వాళ్ళకు కావలసింది మనసూ, మనిషీ కాదు. కేవలం డబ్బు! డబ్బు మాత్రమే? ఈ డబ్బుని ప్రేమించేవాళ్ళు మనుషుల్ని ప్రేమిస్తారా? ఇంత కాలమైనా ఆ కట్నం డబ్బు మావాళ్ళు కూడబెట్టలేకపోయారు. ఫలితం నా జీవితం అంధకార బంధురమైపోయింది.

ఇలాంటి సమయంలో తలవని తలంపుగా మీరు తటస్థ పడ్డారు. నన్ను కదిలించారు. నా జడత్వం వదిలించారు. నాకు ఆశలు రేకెత్తించారు. నాలో అనురాగం పొంగించారు. ఆ రోజు రాత్రి మన బండి ప్రయాణం నా జీవితంలో మరపురాని మనోహరమైన మధురాతి మధురమైన మధుర స్మృతి! ఇది చాలు నా చీకటి జీవితంలో ఎప్పటికీ మరపురాని, మరచిపోని వెన్నెల మలుపు! ఈ వెన్నెల మలుపుల్లో నేను ఇంక ఎంత కాలమైనా ఈ అనుభూతితో, ఆనందంతో హాయిగా బ్రతకగలను. ఈ ప్రేమవరం ప్రసాదించిన మీ కివే నా హృదయ పూర్వక కృతజ్ఞతలు!

ప్రేమతో
ఎప్పటికీ
మీ శ్యామల."

ఉత్తరం పూర్తి చేసేసరికి శారి కళ్ళు ఆర్ద్రాలైపోయాయి. అంతవరకూ బూజులా అల్లుకుపోయిన నైరాశ్యాన్నీ, బిడియాన్ని ఛేదించుకుని తేలిక పడ్డ మనసుతో దృఢ నిశ్చయంతో ఆత్మీయుడైన శేఖర్ దగ్గరికి బయలుదేరాడు. మలయమారుతం మంగళ గీత మాలపిస్తోంది.

